www.prajasakti.com
ప్రజాశక్తి
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
ఆదివారం 15 జనవరి 2023



పరుగు పందెంలో పాల్గొన్న ఎడ్ల జత

సం'క్రాంతి' పండుగ ఏదీ..?

సంక్రాంతి కళ తప్పుతోంది.. పాడి పంటలు.. గొబ్బెమ్మలు.. హరిధాసులు, ..పిండివంటలు. .కొత్తఅల్లుళ్ల సరదాలు.. బంధువుల కేరింతలు..ఇందంతా సంక్రాంతి శోభ..ఇప్పుడు ఆ కళ తప్పుతోంది. సంక్రాంతి అంటేనే రైతుల పండుగ. పండించిన పంట చేతికొచ్చి, ఇంటికి తీసుకొచ్చే వేళ పల్లెలు కళ కళలాడేవి. ఇప్పుడు వ్యవసాయంలో మార్పు వచ్చింది. ప్రభుత్వ విధానాలు, అధికార ధరలు, జీవన విధానంలో మార్పులు రావడంతో మానవ సంబందాలు సైతం తగ్గిపోతున్నాయి. పట్టణాల్లో స్థిరపడ్డవారు సొంతూరుకు వెళ్లడానికి తటపటాయిస్తున్నారు. బందువులను ఇంటికి పిలవడానికి సంకోచిస్తున్నారు. ఇందుకు కారణం మారిన జీవన విధానమే. ప్రతి వస్తువు ధరలు భారీగా పెరిగిపోవడంతో పండుగను ప్రజలు సంతోషంగా చేసుకోలేని పరిస్థితులు కనిపిస్తున్నాయి. గతంలో ఉన్న పండుగ కళ తప్పింది..

- పల్లెల్లోకళ తప్పుతోన్న సాంప్రదాయాలు
- కల్లాల్లోనే పంటలు
- సామాన్యులకు ధరల తిప్పలు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

సంక్రాంతి శోభ పల్లెల్లో తగ్గుతోంది. ఒకప్పుడు సంక్రాంతి వచ్చిందనే వారం రోజుల పాటు హడావుడే. ఇళ్లకు రంగులు వేయడం, కొత్త అల్లుళ్ల రాక, పట్టణాల్లో స్థిరపడ్డ బందువులను ప్రతి ఇల్లు ఆహ్వానించేది. ఏడాది పాటు నగరజీవితానికి అలవాటు పడిన ప్రజలు సంక్రాంతి రోజు సొంతూరుకెళ్లి తమ బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ సరదాగా మూడు, నాలుగు రోజులు గడిపే వారు. కోడి పందేలు, ఎడ్ల పందేలు, ముగ్గుల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఒక్కటేమిటి ప్రతి ఇల్లు ఒక సరదాల కోవెలగా ఉండేది. పేద, ధనిక తేడా లేకుండా ఉన్నంతలో పండుగ జరుపుకునేవారు. రాను రాను ఇది తగ్గుతోంది. ఇందుకు ప్రధాన కారణంగా మారిన జీవన విధానమే. జిల్లాలో వ్యవసాయం ఆలస్యం అవుతోంది. సంక్రాంతికి ఇంటికి రావాల్సిన ధాన్యం పొలాల్లోనే ఉంటుంది. ప్రస్తుతం జిల్లా వ్యాపితంగా అన్ని మండలాల్లోనూ వరి మధ్యస్థంగా ఉంది. వ్యవసా య ఖర్చులు పెరిగి పోయాయి. కొందరు వ్యవసాయంలో నష్టపోతు న్నారు. పెరిగిన ధరలు. ప్రజల ఆదాయం బాగా తగ్గి పోయింది. వ్యవసాయంలో ఆదాయం ఉండడం లేదు. చేసే పనిలో చిన్న చిన్న జీతాలు అందుతున్నాయి. విద్య, వైద్యం వంటివి ఖరీదైపోయాయి. పంటలు, ఏ వస్తువు కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదు. కనీసం పిల్లలకు మంచి దుస్తులు తీసివ్వడానికి కూడా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇది అతిశయోక్తిగా కొందరు భావించొచ్చు. గ్రామీణ ప్రాంతాల్లోని సగటు జీవి జీవన విధానం పూర్తిగా మారింది. పిండి వంటలు చేసుకునే వారు ఇప్పుడు షాపుల నుంచి కొని తెచ్చుకుంటున్నారు. చిన్నపాటి జీతం, భత్యం మద్యానికి తగలేస్తున్నారు. పల్లె జనం పండుగలకు దూరమవుతున్నారు. ఏడాదిలో వచ్చే అతి పెద్ద పండుగ సంక్రాంతి. గతంలో ఉన్న సరదాలు, సాంప్రదాయాలు, ఆటలు అలవాట్లకు క్రమేపీ దూరమవుతున్నారు. అప్పట్లో ఉన్న సం 'క్రాంతి' ఇప్పుడు తగ్గుతుందనే చెప్పాలి.

ప్రతిదీ భారమే..అప్పుల అఘాతమే..!

సంక్రాంతి సందర్భంగా నెల్లూరు నగరం తోపాటు, అనేక ప్రాంతాల్లో ప్రజల హడావుడి కనిపిస్తుంది. పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ ఆఫర్లు పెట్టడంతో పల్లె ప్రాంతాల నుంచి వచ్చిన జనం ఉన్నంతలో కొనుగోలు చేసుకుంటున్నారు. నగరంలోని పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్ పాత దుస్తులను ఆపర్లు రూపంలో అమ్మకాలు చేస్తున్నారు. నగరంలో బ్రాండెట్ షాపులు సైతం బట్టలు ఆఫర్లు పెట్టారు. నిత్యావసర వస్తువుల ధరలు ఏ మాత్రమూ తగ్గలేదు. పప్పులు, నూనెలు,. ఇతర అన్ని వస్తువులు పెరగడంతో పిండివంటలు చేసుకోడానికి పెద్దగా ఆసక్తి చూపడం లేదు. అందుకే పట్టణాల్లో పెద్దపెద్ద దుకాణాలు మురుకులు, నిప్పట్లు, కజ్జికాయలు, వంటివి కేజీల లెక్కన కొనుగోలు చేసుకుం టున్నారు. కొందరు మాత్రం ఇళ్లల్లో వంటలు చేసు కుంటున్నారు. పాత తరం పండుగ పరిస్థితులు మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పోలీస్ అధికారులతో సమీక్షిస్తున్న ఎస్‌పి విజయరావు

కానిస్టేబుల్ పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్త్

ఎస్‌పి సిహెచ్ విజయరావు

ప్రజాశక్తి-నెల్లూరు :జిల్లా వ్యాప్తంగా ఈ నెల 22న జరిగే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు పూర్తి చేయాలి ఎస్‌పి సిహెచ్ విజయరావు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. శనివారం ఎస్‌పి కార్యాల యంలోని పోలీసు అధికారులతో , కో ఆర్డినేటర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు.జిల్లా వ్యాప్తంగా 52 కేంద్రాల్లో న్విహించే కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటలకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద , స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద విధిగా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని విభాగాల సమన్వయంతో పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలీసుస్టేషన్ల పరిధిలోని పరీక్షా కేంద్రాలను సంబంధిత అధికారులు నిశితంగా తనిఖీ చేయాల న్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ పటిష్టంగా అమలు చేయాలన్నారు. పరీక్షలకు హాజరైయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రతి సెంటర్ నందు పోలీసు సిబ్బందితో పాటు అదనంగా రక్షక్ మొబైల్స్, బ్లూ కోల్ట్స్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ కు ఎటువంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసిందన్నారు. పరీక్షా కేంద్రంలోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్స్ , ఇతర డిజిటల్ పరికరాలు అనుమతించకూడదని ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎడ్ల పందేల జోరు..!

- కోవూరులో రాష్ట్ర స్థాయి పోటీలు
- సంక్రాంతి శోభ

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు మండలం, కొత్తూరులో సంక్రాంతి పండుగ సందర్భంగా రైతు సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సీనియర్ ఎడ్ల పందెం పోటీలు శనివారం ఘనంగా జరిగాయి. 37ఏళ్ల నుంచి జరుగుతోన్న ఈ పోటీల్లో బాపట్ల జిల్లా స్టూవర్టు పురం గ్రామానికి చెందిన బి.జయంతి ఎడ్ల జట్టు మూడు కిలోమీటర్ల దూరాన్ని 7.27 నిముషాలలో చేరుకొని ప్రథమ స్థానం సొంతం చేసుకుంది .ద్వితీయ స్థానాన్ని ఇందుకూరుపేట మండలం, గంగపట్నం గ్రామానికి చెందిన చాముండేశ్వరి సీ ఫుడ్స్ ఎడ్ల జట్టు 7.36 నిముషాలలో చేరుకొని కైవసం చేసుకుంది. మూడో బహుమతి నెల్లూరుకి చెందిన జైశ్రీ ఎడ్ల జట్టు 8.06 నిముషాల్లో వచ్చి చేరుకుంది. ఈ పోటీలను తిలకించడానికి జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు వచ్చారు. రాష్ట్రస్థాయి జూనియర్ ఎడ్ల పందెం జిల్లాలోని చెర్లోసంఘం చెందిన శ్రీ ఆంజనేయ ఎడ్ల జట్టు రెండు కిలోమీటర్ల దూరాన్ని 5.14 నిముషాల్లో చేరుకొని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. నెల్లూరుకు చెందిన జయశ్రీ అభ యాంజనేయ స్వామి ఎడ్ల జట్టు 5.15 నిము షాలు వచ్చి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసు కుంది.నెల్లూరు ఇందుకూరుపేట మండలం, గంగపట్నం గ్రామానికి చెందిన పంచాల మోక్షితా రెడ్డి 5.29 నిముషాల్లో వచ్చి తతీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. నెల్లూరు జిల్లా కోవూరుకు చెందిన చెన్నకేశవ స్వామి ఎడ్ల జట్టు 5.35 నిముషాల్లో వచ్చి నాలుగో స్థానాన్ని కైవసం చేసుకుంది. గెలుపొందిన విజేతలకు ఎసిసి కన్వెన్షన్ సెంటర్ అధినేత ప్రముఖ పారిశ్రామికవేత్త అనపల్లి అశోక్ కుమార్ రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ నేతలు పాల్గొన్నారు.

మన్సూర్‌కు సిపిఎం నివాళి

ప్రజాశక్తి -నెల్లూరు

మన్సూర్ బాయ్ 37వ వర్ధంతిని పురస్కరించుకొని మన్సూర్‌భాయ్ స్థూపం వద్ద సిపిఎం జిల్లా కమిటీ ఘన నివాళి అర్పించింది. శనివారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ , కార్యదర్శి వర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, కటారి అజయ్ కుమార్ , డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి గుమ్మల్ల రామన్న ,డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ , డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, ఆవాజ్ జిల్లా కార్యదర్శి రషీద్ , సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ ,నాయకులు పాల్గొన్నారు.

మన్సూర్ స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

పొగమంచుతో ఇక్కట్లు..

తోటపల్లిగూడూరు : మండలంలో శనివారం ఉదయం పొగ మంచు కమ్ముకుంది. తెల్లవారు జాము నుంచ పొగ మంచు వ్యాపించింది. మండలంలో ఏజన్సీ వాతావరణం తలపించేలా రహదారులు కనబడని విధంగా అలుముకున్న పొగ మంచు ఆహ్లాదం కలిగించింది. ఉదయం 7.30 గంటల వరకు ఇదే పరిస్థితి కనబడింది.పొగ మంచు కొన్ని గంటల వరకు కమ్మకోవడంతో రహదారులు, పొలాలు పూర్తిగా కనిపించని పరిస్థితి ఏర్పడింది.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు :సంక్రాతి పర్వదినాన్ని పురస్కరించుకొని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మండలంలోని కోడూరు పంచాయతీలో కాలువ కట్ట పై నివాసముంటున్న నిరుపేద గిరిజనులకు నిత్యావసర సరుకులు, కొత్త దుస్తులను అందజేశారు. స్థానిక టీడీపీ నాయకులు వీరబోయిన గంగాధర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గిరిజనులు తమ సమ్యలపై చంద్రమోహన్ రెడ్డి వద్ద ఏకరువు పెట్టారు. తమకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందడం లేదని ఆయనకు వివరించారు. సోమిరెడ్డిస్పందిస్తూ పేదలు అన్నమో రామచంద్రా అంటూ అల్లాడుతుంటే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విందు, వినోదాల్లో మునిగి తేలుతున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తామని అని చంద్రమోహన్ రెడ్డి గిరిజనులకు భరోసా ఇచ్చారు. టిడిపి నాయకులు బొమ్మి సురేంద్ర, సోమిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చింతా సీతారామయ్య, అబూబాకర్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు అంకమ్మ తల్లి ఆలయ పునర్ నిర్మాణం శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా, శరవేగంగా ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల, భక్తుల పర్యవేక్షణలో జరుగుతుంది. ఆలయ నిర్మాణానికి అమ్మవారి భక్తులు తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్నారు. శనివారం సంక్రాంతి పండుగ సందర్భంగా పబ్బిశెట్టి నరశింహస్వామి, భార్య విజయలక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు పబ్బిశెట్టి వరదరాజ భార్య కమల వారి కుటుంబ సభ్యులు నాగ వెంకట దివ్యశ్రీ, సాయి శ్రీజ, పవన్ కుమార్ రూ.25116లు విరాళాన్ని శాసనసభ్యులు మహీధర్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులు తలపనేని వెంకటేశ్వర్లు, కొడాలి కోటేశ్వరరావులకు అందజేశారు.



విరాళం అందజేస్తున్న దృశ్యం

రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు : ఇంటూరి

ప్రజాశక్తి -కందుకూరు :వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పో యిందని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు విమర్శించారు. నియోజకవర్గ మహిళా కమిటీ ఆధ్వర్యంలో కందుకూరు మండలంలోని విక్కిరాల పేటలో శనివారం మాటమంతి కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమానికి హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ అధికారంలోకి రాకముందు జగన్మోహన్ రెడ్డి మహిళలందరికీ తియ్యటి మాటలు చెప్పి ఎన్నో ఆశలు చూపాడని, అధికారంలోకి వచ్చాక అక్క చెల్లెమ్మలను నిలువునా మోసం చేశాడన్నారు. నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు దివి సౌభాగ్య మాట్లాడుతూ మహిళా సత్తా ఏమిటో రాబోయే ఎన్నికల్లో జగన్ కు చూపించాలన్నారు. చంద్రబాబు నాయుడు, ఆడప డుచులను తోబుట్టువుల్లా చూసుకున్నారని, మళ్లీ ఆయన్ని ముఖ్యమంత్రి చేసుకునేలా కష్టపడదామని మహిళలకు సూచించారు. మండల పార్టీ అధ్యక్షుడు నార్నె రోశయ్య, మహిళా కార్యకర్తలు మన్నం శైలజ గంగవరపు రోజా రాణి, చవిడిపోయిన పద్మ, మన్నం కోటమ్మ, ఎన్ఆర్ఐ వై. అనిత, నియోజవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, స్థానిక నాయకులు గంగవరపు రవి, గంగవరపు పెద్ద బ్రహ్మయ్య కార్యక్రమంలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరులో బివి రాఘవులు..

డాక్టర్ ముువ్వా కొండయ్యతో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు

ఆత్మీయులతో కలయిక

ప్రజాశక్తి -కందుకూరు

సంక్రాంతి పండుగకు తన స్వగ్రామమైన కందుకూరు మండలం, మోపాడుకు వచ్చిన సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు శనివారం కందుకూరులో విస్తృతంగా పర్యటించారు. తన చిన్ననాటి మిత్రులను, పార్టీ ప్రముఖులను, ఉపాధ్యాయులను కలిసి సమకాలీన రాజకీయ, ఆర్థిక, సామాజిక విద్యారంగ, వ్యవసాయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఉదయం11గంటలకు కందుకూరులోని సిపిఎం కార్యాలయాన్ని సందర్శిం చారు. అక్కడ సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు ముప్పరాజు.కోటయ్య, దాసరి రామమూర్తితోపాటు పార్టీ నాయకులతో మాట్లాడారు. రాజకీయ పరిస్థితులను, రైతాంగ ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తొలుత సిపిఎం సీనియర్ నాయకులు డాక్టర్ ముువ్వా కొండయ్య ఇంటికి ఆయన సోదరుడు నరసింగరావుతో కలిసి బీవీ రాఘవులు వెళ్లారు. ముువ్వా కొండయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటున్నారు. ఆయనను పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గత ఏడాది అనారోగ్యంతో మరణించిన సిపిఎం సీనియర్ నాయకులు ఓల్లూరి రామకోటయ్య భార్య రవణమ్మతో రాఘవులు మాట్లాడారు. తన ఆరోగ్యంతోపాటు, కుటుంబ వ్యవహారాలను మాట్లాడారు. అనంతరం సిపిఎం గుడ్లూరు మండల కమిటీ కార్యదర్శి జి వెంకటేశ్వర్లు ఇంటికి, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎస్ఏ.గౌస్ ఇంటికెళ్లి వారి యోగక్షేమాలు, కుటుంబ ఆర్థిక, ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. అక్కడి నుంచి యుటిఎఫ్ కార్యాలయానికి బివి రాఘవులు వెళ్లారు. కొత్తగా నిర్మించిన యుటిఎఫ్ కార్యాలయాన్ని సందర్శించారు. యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు ముప్పరాజు. కోటేశ్వరరావు, వల్లూరి.సాంబశివరావు, మురళి కష్ణ, పొన్నలూరు మాధవరావు, రసూల్ భాషా, లెక్చరర్లు రాజగోపాల్, కాశిరత్నం గార్లతో విద్యారంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాల వల్ల వస్తున్న సమస్యలపై చర్చించారు. డిఆర్ఆర్ విజ్ఞాన భవన్ కందుకూరులో ఉద్యమాల కేంద్రంగా బాసిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం తన చిన్ననాటి హై స్కూల్ గురువు ఆకుల మల్లికార్జున రావు కుమార్తె ఆకుల పార్వతి ఇంటికి వెళ్లి వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విసికె పార్టీ నాయకులు కసుకుర్తి మాల్యాద్రిని కలిశారు. కందుకూరులో సామాజిక పరిస్థితులు తెలుసుకున్నారు. పెరుగుతున్న మతోన్మాదాన్ని ఎదుర్కొనేందుకు లాల్, నీల్ శక్తులు సమైక్యంగా ఉద్యమ పదంలో ముందుకు సాగాలని సూచించారు. పర్యటనలో బీవీ రాఘవులుతో సిపిఎం కందుకూరు నియోజకవర్గ నాయకులు జివిబికుమార్ ఉన్నారు. రాఘవులును కలిసిన వారిలో సిపిఎం కందుకూరు పట్టణ నాయకులు ఎస్.కె. మున్వర్ సుల్తానా, ఎస్. కె సల్మా, టి.వెంకట్రావు, ఎం.ప్రసాద్, పద్మ, డిఎం రాయుడు, ఉలవపాడు సిపిఎం కార్యదర్శి ఎస్. డి. గౌస్ భాషా తదితరులు మర్యాద పూర్వకంగా కలసి మాట్లాడారు. సిపిఎంలో అత్యున్నత బాధ్యతల్లో ఉండి తమను గుర్తుపెట్టుకుని పండుగ రోజు తమ ఇళ్లకు వచ్చి పరా మర్శించినందుకు అందరూ ఆనందం వ్యక్తం చేశారు. మిగతా పార్టీల్లో ఇది చాలా అరుదుగా కనిపిస్తుందని, కమ్యూనిస్టులుకే ఇది సాధ్యమని పలువురు అభిప్రాయ పడ్డారు.

కందుకూరు యుటిఎఫ్ కార్యలయాన్ని సందర్శించిన రాఘవులు



తనకు చదువు చెప్పిన మల్లికార్జున కుమార్తె పార్వతి కుటుంబ సభ్యులతో రాఘవులు

'క్రీడా పండుగ' విశ్వవ్యాప్తం

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న - షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు పారంభం

ప్రజాశక్తి-నెల్లూరు : విశ్వవ్యాప్తంగా నిర్వహించుకొనే పండుగ ఏదైనా ఉందటే అది ఒక్క ఆటల పోటీల పండుగ మాత్రమేనని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న పేర్కొన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డివైఎఫ్ఐ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎసి సుబ్బారెడ్డి ఇండోర్ బ్యాట్మింటన్ స్టేడియంలో కామ్రేడ్ మన్సూర్, గోను చలపతి, మేకల చెంచయ్యల స్మారక జిల్లా స్థాయి షటిల్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు నిర్వహించారు. ఈ క్రీడా పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న, నుడా చైర్మన్, షటిల్ బ్యాట్మింటన్ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్, వెంకట్, మల్లిరెడ్డి కోటారెడ్డి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బి.పి నరసింహ,ఎం.వి.రమణ, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారి శ్రీనివాసులు, కండె కోటేశ్వరరావు, కోశాధికారి డి.శ్రీనివాసులు, స్పోర్ట్సు కన్వీనర్, కో కన్వీనర్లు దేవతాటి సతీష్, దేవతాటి రాజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ డివైఎఫ్ఐ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి, యువజనుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు.కరోనా సమయంలో లాక్‌డౌన్ విధించిన సమయంలో వేలాది, లక్షలాధి మంది ప్రజలు వారి వారి సొంత ప్రాంతాలకు రోడ్డు మార్గంలో వెళ్తున్న సమయంలో దాహార్తి తీర్చడంతోపాటు, ఆహార పదార్థాలు అందజేసిందన్నారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా డ్రగ్స్ మాఫియా పెరిగిపోతుందని, యువత ఎంతో మంది డ్రగ్స్‌కు బానిసలై తమ బంగారు భవిష్యత్తును చేజేతూలారా నాశనం చేసుకుంటున్నారన్నారు. యువతను నిరుద్యోగ సమస్య వేధిస్తుందని, ఈ సమస్యను ఆసరాగా తీసుకొని డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా వ్యవహరిస్తుందన్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని 'నిరుద్యోగం అంతం.. డ్రగ్స్ అంతం.. డివైఎఫ్ఐ పంతం' అన్న నినాదంతో డివైఎఫ్ఐ పనిచేయాలని లక్ష్యంగా నిర్ణయిం చుకుందన్నారు క్రీడలు నిర్వహించడం వల్ల యువతలో స్నేహపూర్వక సంబంధాలు మెరుగుపడతాయని, మానసిక ఉల్లాసం పెరుగుతుందని, విద్య పట్ల శ్రద్ధ పెరుగుతుందని మేధావులు ఇటీవల ఒక నివేదికలో పేర్కొన్నారన్నారు. గ్రామీణ క్రీడలను బ్రతికించాలన్న సంకల్పంతో డివైఎఫ్ఐ చేపట్టిన ఈ క్రీడా పోటీలకు తన వంతు ప్రోత్సాహం నుడా చైర్మన్ ముక్కాల ద్వారకానాద్ అందజేయడం సంతోషకరమన్నారు. తొలుత మల్లిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ యువకులు పెడత్రోవ పట్టకుండా క్రీడలవైపు ప్రోత్సహించే విధంగా టోర్నమెంట్స్ నిర్వహించడం, ఆ దిశగా డివైఎఫ్ఐ అడుగులు వేయడం అభినం దనీయ మన్నారు. నుడా చైర్మన్, షటిల్ బ్యాట్మింటన్ రాష్ట్ర అధ్యక్షులు ముక్కాల ద్వారకానాద్ మాట్లాడుతూ డివైఎఫ్ఐ ఇటువంటి క్రీడలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిభను కనపరిచిన జట్లకు బహుమతులు అందజేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఈ క్రీడా పోటీలల్లో పాల్గొని ప్రతిభను కనపరిచిన క్రీడాకారులకు బహుమతులను ఎంఎల్‌సి విఠపు బాలసుబ్రహ్మణ్యం అందజేశారు.

షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు

పోటీలను తిలకిస్తున్న ఎంఎల్‌సి విటపు బాలసుబ్రమణ్యం, తదితరులు

పేదలకు దుస్తులు పంపిణీ

నెల్లూరు :సంక్రాంతిని పురస్కరించుకొని నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పట్టణ నిరాశ్రయుల కేంద్రంలో నిరాశ్రయులకు కోలా రవి సుప్రియల దుస్తులు పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆశ్రమంలోని వారికి భోజనం పెట్టారు. కోలా రవి సుప్రియ దంపతుల కుమారుడు కుమార్తె బాల అచ్యుత్ పర్ణికలు కుటుంబ సభ్యులు ఆదరణ లేని నిరాశ్రయులకు బట్టలు అందజేశారు. మూడేళ్ల నుంచి పట్టణ నిరాశ్రేయుల కేంద్రం వారికి, న్యూ లైఫ్ హెచ్ఐవి ఎయిడ్స్ కేంద్రం కోవూరు వారికి కొత్త బట్టలు, అవసరమైన ప్రొవిజన్స్ అందజేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ హెల్త్ అసిస్టెంట్ కోలా రవి సతీమణి ఆర్టీసీ లో ఫార్మాసిటీగా సేవలందిస్తున్న కోలా సుప్రియలను ఉద్యోగ సంఘ నాయకులు చేజర్ల సుధాకర్ రావు ఘనంగా అభినందించారు. మానవసేవయే మాధవ సేవ టీం నిర్వా హకులు ఎ. పరిమళ రిటైర్డ్ హెల్త్ అసిస్టెంట్,ఆర్. విశ్వనాథం రిటైర్డ్ టెక్నికల్ ఆఫీసర్, తోట మురళి క్యాటరింగ్ అధినేత, పట్టణ నిరాశ్రయుల కేంద్రం డైరెక్టర్ సుందరంపాల్గొన్నారు.

జిఒ నెంబర్ 1 ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేస్తూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

భోగి మంటల్లో జిఒ నెంబర్ 1 ప్రతులు దగ్ధం

ప్రజాశక్తి-నెల్లూరు : జిఒ నెంబర్ 1 రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్రాల్యకు విఘాతం కలిగించేదిగా ఉందని, తక్షణమే ఆ జిఒను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. శనివారం భోగి పండుగను పురస్కరించుకొని రాష్ట్ర వ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ఐక్యవేదిక పిలుపుమేరకు జిఒ నెంబర్ 1 ప్రతులను భోగి మంటల్లో దగ్ధం చేశారు. అందులో భాగంగా నగరం, రూరల్ నియోజకవర్గ పరిధిలోని 20,21,16, తదితర డివిజన్లలో జిఒ నెంబర్ 1 ప్రతులను భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. వైసిపి ప్రభుత్వానికి నిరసన తమ నిరసన తెలిపారు. ఆయా డివిజన్లలో సిపిఎం నాయకులు ఎం.మోహన్‌రావు, రమాదేవి, గోగుల శ్రీనివాసులు, మాదవి, పి.సూర్యనారాయణ, ఆర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

టిడిపి ఆధ్వర్యంలో...

ప్రజాశక్తి -కందుకూరు :రాష్ట్ర అభివద్ధిని గాలికి వదిలేసి, ప్రతిపక్షాలను ఇబ్బందులు పెట్టడమే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపాలని కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. వైసిపి ప్రభుత్వం కుట్రపూరితంగా తీసుకొచ్చిన జీవో నెంబర్1 ను వ్యతిరేకిస్తూ కందుకూరులోని టిడిపి కార్యాలయంలో శనివారం తెల్లవారు జామున భోగిమంటలు వేసి జిఒ నెంబర్ 1 ప్రతులను దగ్ధం చేశారు. పట్టణ పార్టీ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే సైకో దిగిపోవాల్సిందేనని, మళ్లీ సైకిల్ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు దివి శివరాంతో పాటు పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రూరల్ అధ్యక్షుడు నార్నె రోశయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి చదలవాడ కొండయ్య, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు నాదెండ్ల వెంకట సుబ్బారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, ఉపాధ్యక్షుడు వడ్డేళ్ళ రవిచంద్ర, పట్టణ పార్టీ నాయకులు రత్తయ్య, పొన్నగంటి వెంకట్రావు, ముప్పవరపు వేణు, కల్లూరి శైలజ, సరిత పాల్గొన్నారు.

కందుకూరులో...

ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-నెల్లూరు :స్థానిక16 డివిజన్ ఆదిత్య నగర్ చిల్డ్రన్స్ పార్క్ ఇటీవల కాలంలో అనధికారికంగా భారీ సిమెంట్ ట్యాంకర్లు ఇష్టానుసారం తిరుగుతూ ప్రమాదాలు ట్రాఫిక్ ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయని సిపిఎం నాయకులు ఆర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం నగర ట్రాఫిక్ డిఎస్‌పి సుభాన్‌ను 16వ డివిజన్ సిపిఎం నాయకులు కలిసి ఆ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలకు ప్రధానంగా కష్ణపట్నం పోర్టు నుంచి జాతీయ రహదారి పోవాల్సిన ట్యాంకర్లు చిల్డ్రన్స్ పార్క్ ముత్తుకూరు రోడ్ సెంట్రల్ మీదగా ప్రయాణం చేస్తున్నాయన్నారు. అసలే రద్దీ ప్రాంతం అయ్యి నిత్యం ఈ ట్యాంకర్ల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న అనారోగ్య సమస్యలు కూడా మొదలవుతున్నాయని వెంటనే సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ నగర ట్రాఫిక్ డిఎస్పి సుభానికి వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు గజ్జ నాగేశ్వర రావు, సూర్యనారాయణ, బాబు ,రఘు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎపై అసత్య ప్రచారం తగదు

ప్రజాశక్తి-ఉదయగిరి

ఉదయగిరి ఎంఎల్ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక కొంతమంది చేస్తున్న అసత్య ప్రచారాలు లేనిపోని నిందలు వేస్తున్నారని వారి ఆటలు కట్టిస్తామని సర్పంచ్ కల్లూరి వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ప్రజలు మేకపాటిపై చూపిస్తున్న ప్రేమ అభిమానాలను చూసి ఓర్వలేక, రాజకీయంగా ఆయనను ఎదుర్కోలేక ఏదో ఒక విధంగా ఆయనను ఇబ్బంది పెట్టాలన్న దురుద్దేశంతో కొందరు చేస్తున్న కుట్రలు కుతంత్రాలు ఇక సాగనివ్వమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు చేస్తున్న దుష్ప్రచారాలు అడ్డుకోవడానికి మేకపాటి సైన్యం ఎప్పుడు ఆయన వెన్నుదన్నుగా నిలబడి ఆయన గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతామన్నారు. ఎప్పుడు ఎక్కడ ఎలాంటి సమస్య ఆయనకు ఎదురైనా వాటిని ఎదుర్కోవటానికి సర్వం సిద్ధంగా ఉన్నామన్నారు. కొంతమంది దురాలోచనతో ఆయన ప్రతిష్టకు భంగం కలిగించేలా పన్నాగం పడుతున్నారని ఎవరెన్ని పన్నాగాలు పన్నినా వాటిని తిప్పి కొట్టేలా నియోజకవర్గ ప్రజలు ఆయనకు తోడుగా ఉంటామని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో ఆయనకు టిక్కెట్ రాకుండా పలువురు అడ్డుపడుతూ కుట్రలు చేస్తున్నారని వాని ఆట కట్టించే దిశగా మేకపాటి సైన్యం ఎప్పుడూ ఆయనకి ముందుంటుందని ఇలాంటి దుష్ప్రచారాలు మానుకోవాలని ధీటుగా హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో వందకి 100 శాతం విజయం సాధిస్తామని మేకపాటి గెలుపు తథ్యమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

2024లో అధికారంలోకి 'టిడిపి'

ప్రజాశక్తి-ఉదయగిరి : సైకో పాలనపై ప్రజలు విసిగి పోయారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి రావటం ఖాయమని మండల టిడిపి కన్వీనర్ చింతనబోయిన బయన్న ధీమా వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక యాదవ వీధిలో భోగి సందర్భంగా టిడిపి మండల కమిటీ నాయకులు జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన చీకటి జిఒ నెంబర్ -1 ప్రతులను భోగి మంటలు వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే ప్రజల గొంతు నొక్కేందుకు జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన చీకటి జిఒ తీసుకురావడం దుర్మార్గమన్నారు. అనంతరం సైకో పాలన... సైకిల్ రావాలనే ప్లకార్డులను పట్టుకుని నినాదాలు చేశారు. జగన్ పాలనలో నలుగురు కలిసి స్వేచ్ఛగా తిరిగేందుకు వీలు లేకుండా చీకటి జిఒను తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ జిఒను హైకోర్టు సస్పెండ్ చేసిందన్నారు. రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగుతోందని దళితులపై దాడులు పెరుగుతున్నా పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలుక చంద్రశేఖర్ ఎంఆర్‌పిఎస్ కాదు..

ప్రజాశక్తి-కావలి : ఉదయగిరి నియోజకవర్గం జలదంకి మండలం హనుమకొండ పాలెం గ్రామానికి చెందిన ఎలుక చంద్రశేఖర్ కొన్ని సంవత్సరాలుగా ఎంఆర్‌పిఎస్ నాయకుడు అని చెప్పుకుంటూ దందాలు చేస్తూ ఉన్నాడని, కానీ ఆయన తమకు సంబంధించిన ఎంఆర్‌పిఎస్ నాయకుడు కాదని సంబంధిత ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి నాయకులు చేవూరు కిరణ్‌కుమార్, అక్కిలిగుంట యేసు, చేవూరు వరప్రసాద్ తెలియజేశారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో శనివారం జరిగిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడుతూ శుక్రవారం కావలికి చెందిన ఫారెస్ట్ ఆఫీసర్‌ను బెదిరించిన విషయం బాహ్య ప్రపంచంలోకి రావడం శుభ పరిణామమన్నారు. ఇతనికి జిల్లాలో అనేకమంది ఎంఆర్‌పిఎస్‌కి ప్రజల్లో ఉన్న అభిమానాన్ని ఉద్యమ నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని కొంత మంది అధికారులను బెదిరించి, బెదిరింపులకు తలొగ్గి వాళ్ళు అడిగినంత సమర్పించుకోవడం జరుగుతుందన్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ నాయకత్వంలో దక్షిణ భారతదేశమంతటా వ్యాపించి ఉండడం, ఇంతకుముందు ఎంఆర్‌పిఎస్‌లోనే ఉంటూ కృష్ణ మాదిగ ద్వారా బహిష్కరింపబడిన నాయకులే ఇలా దందాలు కొనసాగిస్తున్నారన్నారు. ఏపి ఎంఆర్‌పిఎస్ అని, స్వర్ణాంధ్ర ఎంఆర్‌పిఎస్ అని ఇలా వివిధ రకాల పేర్లు పెట్టుకుని ఎటువంటి ఉద్యమ నేపథ్యాలు లేకుండా దందాలే పరమావధిగా ఉన్నారని తెలిపారు. ఇలా ఇంకెవరైనా అధికారుల దగ్గరికి వచ్చి బెదిరించినా, మరే విధమైన ఇబ్బందులు గురిచేసినా, తమకు ఫోన్ చేయాలని, వారిపై కేసు పెట్టి అరెస్టు చేయిస్తామని ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చిరెడ్డిపాలెం డి.ఎ.ఎన్.ఆర్.పాఠశాలలో 1998-99 పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ అపూర్వ సమ్మేళనం శనివారం పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. 21 సంవత్సరాల తరువాత బాల్యమిత్రులు ఒక చోట కలుసుకోవడం చెప్పుకోలేని మధుర అనుభవం కలిగించిందని పూర్వ విద్యార్థి ప్రస్తుత పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు గురవయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువులతో పాటు విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకొని ఆత్మీయంగా ఒకరినొకరు పలుకరించుకున్నారు. తదుపరి భౌతికంగా దూరమైన ఉపాధ్యాయుల గురించి నివాళులు అర్పించి మౌనప్రదర్శన చేపట్టారు. అనంతరం కొందరు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానంలో గౌరవాన్ని పొందినప్పుడే ఉపాధ్యాయులకు పూర్తి గుర్తింపు లభిస్తుందన్నారు. విద్యార్థులు మాట్లాడుతూ గురువులు చూపించిన సన్మార్గంలో నడిచి ప్రస్తుతం ప్రతి విద్యార్థి వివిధ వత్తుల్లో, ప్రభుత్వ ఉద్యోగాల్లో కొనసాగుతూ ఆనంద జీవితాన్ని గడుపుతు న్నట్లు పేర్కొన్నారు. విద్యార్థుల ప్రేమకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. అనంతరం గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొండయ్య, వెంకటేశ్వర్లు, మాణిక్యమ్మ, జయబాల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భోగిమంటల్లో జిఒ నెంబర్ 1 ప్రతులు దగ్ధం

మర్రిపాడులో...

జలదంకిలో...

ప్రజాశక్తి-మర్రిపాడు

రాష్ట్రంలో అధికార వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ర్యాలీలు, ఊరేగింపులు, సభలను నిర్వహించరాదని తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1 ప్రతులను జిల్లా సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు మూలి వెంగయ్య శనివారం తిక్కవరంలో భోగిమంటల్లో వేసి దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ కాలంనాటి చీకటి జిఒలను ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి జారీ చేసి విపక్షాల గొంతు నొక్కే ప్రయత్నం చేయడం దుర్మార్గమ న్నారు. జిఒ నెంబర్ 1పై హైకోర్టు స్టే విధించినా అది తాత్కాలికమే అని వెంటనే ప్రభుత్వం ఈ జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో పలు గ్రామాల్లో సిపిఎం సానుభూతిపరులు ఈ ప్రతులను భోగి మంటల్లో వేసి తగులబెట్టారు. కార్యక్రమంలో తిక్కవరం సిపిఎం నాయకులు గంగినేని తిరుపతి, సానుభూతిపరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - జలదంకి : ప్రజాస్వామ్య హక్కులను కాలరాసే జిఒ నెంబర్ 1 రద్దు చేయాలని గట్టుపల్లి గ్రామంలో శనివారం జిఒ ప్రతులను సిపిఎం నేత దమ్ము దర్గాబాబు భోగి మంటల్లో వేసి దగ్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నెంబర్ 1 ప్రజాస్వామ్యంపై నిర్బంధంగా ఉన్న చీకటి జిఒ అని తెలిపారు. జిఒలో రహదారులు వీధుల్లో ర్యాలీలు సభలు సమావేశాలు నిర్వహించకూడదని 1861 బ్రిటీష్ కాలం నాటి పోలీసు సెక్షన్ 3 ఇచ్చిన అధికారాలతో సెక్షన్ 30 నిర్బంధాన్ని తీసుకురావటం ప్రజా ఉద్యమాలను ప్రజా స్వామిక శక్తులు గొంతునొక్కడమేనని అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వం భారత దేశ పౌరులను అణగదొక్కడానికి జిఒ నెంబర్ 1 తెచ్చారని తెలిపారు. బ్రిటీష్ వారు దేశం విడిచి వెళ్లి పోయినా.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆ జిఒను అమలు చేయడం దారుణమన్నారు. ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని పాలన సాగిస్తుందని విమర్శించారు. ఉద్యమ కారులపై కేసులు పెడుతూ భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలో కల్పించిన హక్కులను కాలరాస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజాస్వామ్యన్ని ఖూనీ చేసే నిర్బంధ చీకటి జీవో నెంబర్ 1 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ప్రభుత్వం అడ్డగోలుగా జారీ చేసిన జిఒ నెంబర్ ఒకటిని రద్దు చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు డిమాండ్ చేశారు. శనివారం ఆత్మకూరు పట్టణంలోని బిఎస్ఆర్ సెంటర్‌లో వివిధ ప్రజా సంఘాలు నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో నిరసన తెలిపి జిఒ నెంబర్ ఒకటి ప్రతులను భోగిమంటలలో దహనం చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి మాట్లాడుతూ భావ ప్రకటన స్వేచ్ఛను హరించే ప్రజాస్వామికమైన జిఒ నెంబర్ 1ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగులు, కార్మిక, నిరుద్యోగ సమస్యలను నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బ్రిటీష్ కాలంలో స్వాతంత్రం కోసం పోరాటం చేసిన వారిపై ఈ జిఒను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం అమలు చేశారన్నారు. కార్మికులంతా కనీస వేతనాలు కావాలని పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తున్న ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ సంధాని, ఎపి రైతు సంఘం మండల ప్రధాన కార్య దర్శి లక్కు కృష్ణప్రసాద్, ఆవాజ్ రాష్ట్ర కార్య వర్గ సభ్యులు పి.యస్థాని, తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : కావలి పట్టణం వెంగళరావునగర్లో శనివారం తెల్లవారు జామున భోగి మంటలలో జిఒ నెంబర్ ఒకటి ప్రతులను తగులబెట్టారు. అనంతరం సిపిఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం గత పురాతన జిఒను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన జిఒ నెంబర్ ఒకటి వల్ల ప్రజా ఉద్యమాలు అణిచివేసే విధంగా ఉన్నాయన్నారు. దీనివల్ల ప్రజల హక్కులు కోల్పోతారని రాష్ట్ర ప్రభుత్వం గత పురాతన జిఒలను తీసుకొచ్చి ప్రజా పోరాటాలను అణగ దొక్కాలని రాష్ట్ర ప్రభుత్వం చూడడం చాలా దుర్మార్గమైన విషయమన్నారు. ప్రజా వ్యతిరేక పరిపాలన సాగించిన ప్రభుత్వాలు ఏవి అధికారంలోకి రాణించ లేక పోయాయని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన జిఒ నెంబర్ ఒకటిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.చెన్నయ్య, పి.శ్రీనివాసులు, పి.రఘు, డివైఎఫ్ఐ నాయకులు పి.పెంచల నరసింహ, బి.వేణు, పి.కోటేశ్వరరావు, బి.వినయ్‌కుమార్,తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-జలదంకి : జిఒ నెంబర్ ఒకటి ప్రతులను బస్టాండ్ సెంటర్లో భోగిమంటల్లో వేసి సిపిఎం వ్యవసాయ కార్మిక సంఘం, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో దగ్ధం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ జిఒ ప్రజాస్వామ్య హక్కులను, పౌర హక్కులను, రైతులు, వ్యవసాయ కార్మికులు యువకుల తదితర ప్రజల సమస్యలను వెల్లడి చేసుకునే దానికి నిరసన తెలియజేసే దానికి వీలు లేకుండా చేసిందన్నారు. సభలు, సమావేశాలు, ప్రదర్శనలు, ర్యాలీలు చేయనీయకుండా ఈ జిఒ వల్ల నిషేధం విధించిందన్నారు. 1861 లో బ్రిటీష్ ప్రభుత్వం తీసుకొచ్చిన నిరంకుశ చట్టాన్ని ఈ జిఒ ద్వారా మళ్లీ అమలులోకి తీసుకొచ్చారని తెలిపారు. ప్రజలు ప్రజాతంత్రవాదులు ఈ జిఒను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకునేంత వరకు పోరాడాలని నాయకులు పిలుపు నిచ్చారు.వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరు మాల్యాద్రి, సిపిఎం గ్రామ కార్యదర్శి వేలంగి ఆంథోనీ బాబు, రావి మనోహర్, ఉప్పు ప్రసాదు, గాలం యానాదయ్య, కుట్టు బోయిన శ్రీనయ్య, శేషారెడ్డి తదితరులున్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

'మన్సూర్'కు ఘన నివాళులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రజా సమస్యలపై నిరంతర పోరాట యోధుడు, అల్లరి మూకల దాడిలో అమరుడైన మన్సూర్ భాయ్ వర్థంతి సందర్భంగా శనివారం నివాళి కార్యక్రమాన్ని బస్టాండు పట్టణంలో ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మకూరు పట్టణవాసి పి.యస్థాని బాషా నిర్వహించిన ఈ నివాళి కార్యక్రమంలో పట్టణ సిపిఎం నేతలు రైతు సంఘం ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం పోరాటం చేస్తూ అల్లరి మూకల ఏర్పాటు వారిని పనులు వ్యతిరేకించే క్రమంలో వారి చేతిలో హతమై అమరుడైన మన్సూర్‌భాయ్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ప్రజా వ్యతిరేక విధానాన్ని మన్సూర్ ఎప్పుడు కూడా వ్యతిరేకించే వారిని అటువంటి వారి జీవితాన్ని స్మరించుకుంటూ వారిని నివాళులర్పించడం ఎంతో గౌరవంగా గర్వంగా ఉందని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు, కౌలు రైతు సంఘం జిల్లా నేత లక్ష్మీపతి, ఆత్మకూరు మున్సిపల్ వైస్ చైర్మన్ సంధాని, ప్రజానాట్యమండలి గద్దర్ బాబు, డివైఎఫ్ఐ, సిఐటియు నేతలు, తదితరులున్నారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

- ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : తెలుగు వారి ముఖ్యంగా రైతాంగానికి పెద్ద పండగలు అయిన సంక్రాంతి పండగలను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలని ఎంఎల్ఎ మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతికి పెద్ద స్థానమే ఉందని బంధు మిత్రులతో కలిసి సంతోషంగా విందు వేడుకలు చేసుకుంటూ సంక్రాంతి పండగను జరుపుకోవడం ఆనవాయితీ అని అన్నారు. రైతులు లోగిళ్లు, పాడి పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

సిపిఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-అనంతసాగరం

మండలంలోని రాజు నగర్‌లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా శనివారం సంక్రాంతి సంబ రాలు కార్యక్రమంలో మహిళ లకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు వేము పెంచలయ్య మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా మహిళల్లో ఉండే కళా నైపుణ్య ప్రదర్శన ముగ్గుల ద్వారా బయట పడుతుందని, సంక్రాంతి పండుగ అంటేనే ముగ్గుల పండుగన్నారు. సిపిఎం కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో మూడు రోజుల పాటు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మొదటి రోజయిన భోగి పండుగ రోజు రాజునగర్‌లో, సంక్రాంతి(పెద్ద పండుగ)రోజు ఎస్‌సి కాలనీలో కనుమ పండుగ రోజు బిసి కాలనీలో చేపట్టారు. ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతివారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. గెలిచిన వారికి బహుమతులు అందిస్తున్న హిందూ స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాపిశెట్టి నరసింహులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జెవివి నాయకులు గాడి సుధాకర్ పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా హెల్త్ సూపర్‌వైజర్ తానికొండ ప్రసాద్ వ్యవహరించారు.

బీద రవిచంద్రను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి గ్రామానికి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర విచ్చేయగా శనివారం పలు గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు ఆయనను కలసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తదుపరి బీద సోదరులను ఘనంగా సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. భోగి పండుగ సందర్భంగా గ్రామానికి రాగా సమాచారం తెలుసుకున్న కార్యకర్తలు విచ్చేసి పలు విషయాలను ఆయనతో నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు అయ్యేంతవరకు ఇక్కడే ఉంటానని పార్టీ శ్రేణులకు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా భోగి మంటలు

ప్రజాశక్తి-అల్లూరు : మండలంలోని అన్ని గ్రామాలలో శుక్రవారం వేకువ జామున సాంప్రదాయబద్ధంగా భోగి మంటలను వేశారు. యువతీ, యువకులు, వృద్ధులు అందరూ కలసి ఆయా గ్రామాల పురవీధులలో ఘనంగా భోగి మంటలను వేసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముందుగా తాటాకులతో మొదలుపెట్టి ఆయా ఇళ్ల వద్ద నుండి కట్టెలు, కొయ్యలు సేకరించి భోగి సంబరాలు నిర్వహించారు. అలాగే బంధువులు, నూతన వధూవరులు విచ్చేసి ఈ పండుగను ఆనందంగా జరుపుకున్నారు. శనివారం భోగి నీళ్లను పోసుకుని మహిళలు కుటుంబసమేతంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు.

ప్రజాశక్తి-మర్రిపాడు : మండల వ్యాప్తంగా ప్రజలు భోగి పండుగను అంబరాన్నంటేలా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుండి ఇళ్లముందు భోగి మంటలతో, మహిళలు విభిన్న రంగులతో రంగవల్లులు వేస్తూ చిన్నా పెద్దల సందడితో సంక్రాంతి శోభను తీసుకొచ్చాయి. పట్టణాల్లో ఉండే బంధువులు, కొత్త అల్లుళ్ల గ్రామాలకు రావడంతో సందడి నెలకొంది.

సంక్రాంతి సంబరాల్లో బిఎంఆర్

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లి గ్రామంలో బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంక్రాంతి సంబరాల్లో శనివారం రాజ్యసభ సభ్యులు డాక్టర్ బీద మస్తాన్‌రావు విచ్చేసి సంబరాలలో పాలుపంచుకున్నారు. భోగి పండుగను పురస్కరించుకొని వేకువజామున ఆయన స్వగృహం వద్ద భోగి మంటలను వేసి అందరిని అలరించారు. అభిమానులు భారీ సంఖ్యలో ఆయన ఇంటి వద్దకు విచ్చేసి శాలువాలతో ఘనంగా సత్కరించి భాజా భజంత్రీల నడుమ ఊరేగింపుగా తీసుకువెళ్లి గంగమ్మ, శివాలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు అంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉట్టిపడే కళ అని పేర్కొన్నారు. ఆడపడుచులు వివిధ రంగుల వస్త్రధారణలతో అందంగా అలంకరించుకుని శోభాయమానంగా పెద్ద పండుగను జరుపుకుంటారని తెలిపారు. రైతులకు విరివిగా పంటలు పండగా కుటుంబ సభ్యులందరూ కలిసి సుఖశాంతులతో జరుపుకునేది మకర సంక్రాంతి అంటూ తెలియబరిచారు. పాడి పరిశ్రమ సమృద్ధిగా ఉండాలని దృక్పథంతో పశువులకు వివిధ రంగులు వేసి కనుమ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారమన్నారు. కోవిడ్ కారణంగా 2 సంవత్సరాలు సంక్రాంతి సంబరాలు నిర్వహించలేదని తెలియజేశారు. సంస్కృతి సాంప్రదాయాల నడుమ గంగిరెద్దులు, ముగ్గులు, గొబ్బెమ్మలు, డప్పులు, కోలాటం తదితర కళలను ఏర్పాటుచేసి ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. జిల్లా వాసులు, కావలి నియోజకవర్గం అలాగే తన స్వగ్రామ ప్రజలు సుఖ సంతోషాలు,అష్ట ఐశ్వర్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నేను విద్యను అభ్యసించిన జిల్లా పరిషత్ హై స్కూల్ నుండి జావిద్ అనే కుర్రవాడు హర్యానాలో జరిగిన నేషనల్ క్రీడల్లో మొదటి బహుమతి సాధించారని అలాగే మెహారాజ్ అనే యువకుడు ఒంగోలులో జరిగిన సౌత్ ఇండియా అథ్లెటిక్స్ క్రీడలు, హర్యానా జాతీయ క్రీడల్లో లాంగ్ జంప్, షాట్ పుట్ నందు 3 మెడల్స్ సాధించడం గర్వకారణమన్నారు. నెల్లూరులోని జెండా వీధికి చెందిన షాకీమ్ బిఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సహాయ సహకారాలు పొంది న్యూజిలాండ్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్‌లో అంతర్జాతీయ స్థాయిలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నట్లు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో జగన్మోహన్ రెడ్డి రాజ్యసభ పదవిని ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పల్నాడు, బాపట్ల, ప్రకాశం 3 జిల్లాలకు రీజనల్ కోఆర్డినేటర్‌గా నియమించగా తనవంతు కృషి చేసి 21 మంది ఎంఎల్ఎలను విజయ పథంలో ముందుకు తీసుకువెళ్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో కావలి మాజీ ఎఎంసి చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, బీద రమేష్ యాదవ్, బీద చైతన్య, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, సర్పంచ్ పాటి రంజిత్‌కుమార్, దర్శిగుంట వెంకయ్య తదితరులున్నారు.

మహిళలకు నగదు అందజేస్తున్న రాజ్యసభ సభ్యులు బిఎంఆర్

జిఒ నెంబరు ఒకటి అమలు దుర్మార్గం

ప్రజాశక్తి-నెల్లూరు

జాతీయ రహదారులలో మున్సిపాలిటీల రోడ్లు, పంచాయతీ రోడ్లలో ఎలాంటి మీటింగ్లు జరపకూడదని 1861 సంవత్సరం బ్రిటీష్ కాలం నాటి జిఒ నెంబర్ 1 ను రాష్ట్ర వైసిపి ప్రభుత్వం తీసుకురావడం ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, స్వాతంత్ర్యానికి అత్యంత ప్రమాదకరమని, అటువంటి జిఒను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలంటూ ప్రతిపక్ష పార్టీలన్నీ రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ప్రజలు, రాజకీయ పార్టీలు ఈ జిఒ అమలును వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జివో నెంబరు ఒకటిని జనవరి 23వ తేదీ వరకు సస్పెండ్ చేస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని డివైఎఫ్ఐ రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎసి సుబ్బారెడ్డి ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియంలో మన్సూర్, గోను చలపతి, మేకల చెంచయ్యల స్మారక జిల్లా స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి విశేష స్పందన కనిపించింది. జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు సంక్రాంతి వేడుకలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన, మహిళల ముగ్గుల పోటీలు, భోగి మంటల వేడుకలు అబ్బురపరిచాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో దళితులపై దాడులు పెరిగిపోతున్నాయని, ఈ దాడులను అరికట్టేందుకు పోలీసులు పటిష్టచర్యలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని, అదే సమయంలో బాధితులకు భరోసా కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా అధికారులు కెవిపిఎస్ నాయకులు వినతిపత్రం అందజేసి కోరారు. నగర శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచి ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు కార్పోరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలంటూ డివైఎఫ్ఐ జిల్లా కమిటీ నిరసన కార్యక్రమాలు చేపట్టడంతోపాటు కమిషనర్‌కు వినతిపత్రాలు అందజేసింది. డివైఎఫ్ఐ జిల్లా కమిటీ చేపట్టిన నిరసన కార్యక్రమాలకు స్పందించిన కమిషనర్ నగర శివారు ప్రాంతాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంది. అందులో భాగంగా డ్రెయినేజీ కాలువల్లోని స్టిల్‌ను తొలగించడం, దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహణ వంటి చర్యలు చేపట్టింది. ఉదయగిరి శాసనసభ్యులు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి తన తండ్రి అని, అందుకు తగిన ఆధారాలు తన వద్ద ఉన్నాయంటూ శివచరణ్ రెడ్డి అనే యువకుడు బహిరంగ లేఖ విడుదల చేయడమే కాకుండా అందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాకు విడుదల చేశాడు. ఇటీవల కాలంలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి రెండవ భార్యను అని అంటూ ఓ యువతి ప్రకటన చేసింది. ఈ ప్రకటనలకు స్పందించిన ఉదయగిరి శాసనసభ్యులు తనకు ఇద్దరు భార్యలు, ఇద్దరు కుమార్తెలున్నారని, కుమారులు లేరని మీడియా ముందు ప్రకటించారు. ఈ ప్రకటన వెలువడిన మరుసటి రోజునే శివచరణ్ రెడ్డి అనే యువకుడు తన తండ్రి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి అని, డిఎన్ఎ పరీక్షలకు సైతం తాను సిద్ధం అంటూ మీడియా ముందుకు వచ్చాడు. యువకుడు విసిరిన సవాల్ కారణంగా మేకపాటి కుటుంబంలో కలవరం నెలకొంది.

వీక్షణం

ఫుట్‌బాల్ విజేతగా 'లిటిల్ ఇంగ్లాండ్'

ప్రజాశక్తి-బిట్రగుంట

మండలంలోని ఇంగ్లీష్ మీడియం క్రీడా మైదానంలో గత మూడు రోజులుగా కాండ్ర సతీష్ నాయుడు యువ నేస్తం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలలో విజేతలుగా బిట్రగుంట లిటిల్ ఇంగ్లాండ్ టీం నిలిచింది. విజేతలకు పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, కాండ్ర సతీష్ నాయుడుతో కలిసి రూ.30 వేల నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిట్రగుంట క్రీడలకు పుట్టిందిల్లని ఆంగ్లేయుల కాలం నుండి లిటిల్ ఇంగ్లాండ్‌గా పేరుగాంచిందన్నారు. కార్యక్రమంలో బాపట్ల వెంకటపతి, పీట్ల ప్రత్యూష, బాజీ యువ నేస్తం సభ్యులు క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ ఉత్సవం

ప్రజాశక్తి-అల్లూరు

మండల కేంద్రంలోని దళితవాడలో శుక్రవారం రాత్రి ఘనంగా మహాలక్ష్మమ్మ ఉత్సవాన్ని భక్తులు నిర్వహించారు. ఉత్సవం సందర్భంగా ముందుగా గ్రామస్తులు అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైన సద్ది నివేదన కార్యక్రమాన్ని చేపట్టారు. కన్నుల పండువగా గ్రామంలో విద్యుత్ దీపాలు పలు కటౌట్లను ఏర్పాటు చేశారు. భోగి పండుగ పర్వదినాన అమ్మవారు తమ వాకిళ్ల ముందుకు చేరుకోగానే మహిళలు అందంగా ముగ్గులు వేసి స్వాగతం పలికారు. అలాగే మహిళలు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకుని నైవేద్యాన్ని సమర్పించారు. తీన్మార్ బ్యాండ్, డీజే తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న 'డివైఎఫ్ఐ' క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఆత్మకూరుఅర్బన్

ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జరిగే క్రీడా పోటీలు జక్కా వెంకయ్య ప్రాంగణంలో శనివారమూ కొనసాగాయి. క్రీడా నిర్వాహకులు నందా శ్రీనివాసమూర్తి తెలిపారు. శనివారం రెండవ రోజు జక్కా వెంకయ్య చిత్రపటానికి సిపిఎం నాయకులు కె.డేవిడ్‌రాజు పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం క్రీడా పోటీలు ప్రారంభమ య్యాయి. స్థానిక శ్రీ వెంకటేశ్వర ప్రజా వైద్యశాల అధినేత డాక్టర్ జాగర్లమూడి ప్రణీత్ హాజరై క్రీడాకారులను అభినందించారు. రెండవ రోజు 16 టీములు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ నాయకులు కార్యకర్తలు ఎంతో క్రమశిక్షణతో ప్రతియేటా క్రీడా పోటీలు ప్రత్యేకించి క్రికెట్ నిర్వహించడం సంతోషకర మన్నారు. ప్రస్తుత పరిస్థితులలో యువతకు క్రీడలు ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో మల్లిక శ్రీనివాసులు, డివైఎఫ్ఐ మాజీ నాయకులు ఆళ్ల హజరత్తయ్య, జిలాని, పి.శ్రీనివాసులు, రిచ్చర్ట్, జీవన్, ఎలియాజర్, ప్రస్తుత డివైఎఫ్ఐ నాయకులు వహిద్, జయ కుమార్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖాదర్‌బాషా, యుటిఎఫ్ నాయకులు మహబూబ్ బాషా, పిటి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

చుంచులూరులో క్రీడా పోటీలు

ప్రజాశక్తి-మర్రిపాడు

సంక్రాంతి పండుగను పురస్కరించుకొని చుంచులూరు గ్రామ సర్పంచ్ ముద్దలూరు వెంకటరాజు స్మారకార్థం క్రీడా పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణ శాస్త్ర సాంకేతిక సలహాదారు గండ్రా సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుంచులూరుతో తనకు పరిచయం ఉందని, అక్కడ స్కూళ్లలో వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడేవారని తెలిపారు. గ్రామాలలో సంక్రాంతి పండుగ సందర్భంగా అందరూ క్రీడలలో పాల్గొనడం ముఖ్యమన్నారు. చాలా రోజులు తర్వాత కార్యక్రమాలు చేయడం వల్ల పరిచయాలు, స్నేహ సంబంధాలు ఏర్పడతాయని తెలియజేశారు. క్రీడలలో స్ఫూర్తి పెరిగి తమ టీం గెలవాలనే పోటీతత్వం ఏర్పడుతుందన్నారు. యువత మానసిక ఉల్లాసానికి ఉత్తేజానికి ఇటువంటి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని

తెలిపారు. గతంలో కేంద్ర ప్రభుత్వం మరుగు దొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరుచేసిన కొందరు వినియోగించుకోలేదన్నారు. బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన చేయరాదని, ప్రతి ఇంటిలో ఒక మరుగు దొడ్డి నిర్మించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలోని విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే ఒక్కొక్క గ్రామం నుండి ఒక్కో అబ్దుల్ కలాం తయారు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రముఖ రాజకీయ నాయకులు సుబ్బరాజు, వైసిపి నాయకులు శ్రీనివాసులు నాయుడు, సిద్ధంరెడ్డి మోహనరెడ్డి, బ్రాహ్మణపల్లి మాజీసర్పంచ్ అమర్నాధరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కొడవలూరు : బుచ్చి నగరపంచాయతీ పరిధిలోని పదమూడో వార్డులో జొన్నవాడ దేవస్థానం చైర్మన్ పుట్టా లక్ష్మీ సుబ్రహ్మణ్యం నాయుడు ఆయన సతీమణి కౌన్సిలర్ పుట్టా కాంతమ్మ ఆయన కుటుంబ సభ్యులతో కలిసి సచివాలయ సిబ్బంది వలంటీర్లకు దుస్తులు, స్వీట్లు పంచిపెట్టి వారిని సత్కరించారు.అనంతరం వారు మాట్లాడుతూ నగర ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారి భక్తులకు పాలకమండలి సభ్యులకు భోగి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి కారు బోల్తా

- పలువురికి గాయాలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మంగళగిరి నుంచి కడపకు వెళ్తున్న కియా కారు అదుపుతప్పి ప్రమాదానికి గురైన ఘటన శనివారం మండలం పరిధిలోని జాతీయ రహదారిపై ఉదయం 8 గంటలకు చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు మహిళలు, ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల మేరకు.. మంగళగిరిలోని ఎయిమ్స్ హాస్పిటల్‌లో ఫారెన్సిక్ విభాగంలో డాక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శేఖర్‌రాజు తన కుటుంబ సభ్యులతో కడపకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం ఉదయం 8 గంటలప్పుడు వరికుంటపాడు అంకాలమ్మ గుడి దగ్గర కారు బోల్తా పడి రోడ్డు పక్కనున్న పెద్ద గుంతలో పడిపోయినది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న వారికి గాయాలు కాగా వారిని వరికుంటపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం పామూరు ఆరోగ్య కేంద్రానికి తరలించారు. సమాచారం అందుకున్న ఎస్ఐ బాల్ మహేంద్ర నాయక్ ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపడుతున్నారు. వరికుంటపాడు నుండి జడదేవి మధ్యలో ప్రతిసారి ఇలాంటి ప్రమాదాలు జరగటం ఆందోళనకరంగా మారింది. నేషనల్ హైవే అథారిటీ వారు తగిన భద్రత ఏర్పాట్లు చేసి జరుగుతున్న ప్రమాదాల నివారణకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

కోడి పందెం రాయుళ్లు అరెస్ట్

ప్రజాశక్తి-సీతారామపురం

కోడిపందేల స్థావరంపై దాడి చేయగా ఎస్ఐ కె.కిషోర్‌బాబు 9 మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఎస్ఐ కె.కిషోర్‌బాబు వివరాలు తెలియజేశారు. మండలంలోని అయ్యవారిపల్లి, వడ్లవారిపల్లి గ్రామాల సమీపంలోని అడవి ప్రాంతంలో తరచూ కోడిపందాలు నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు తమ సిబ్బందితో దాడులు చేశామని ఘటనా స్థలంలో కోడిపందేలు నిర్వహిస్తున్న వారిలో 9 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి వద్ద ఐదు కోళ్లు, ఆరు బైకులు, రూ.3350 నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులపై కేసు నమోదు చేస్తామన్నారు. మండలంలో ఎక్కడైనా కోడిపందాలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అట్లు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని ఇస్కపల్లిపాలెంకు చెందిన ప్రళయ కావేరి తాతయ్య అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా శనివారం కోవూరు సెబ్ అధికారి నరహరి రావు విస్తృతంగా దాడులు చేపట్టి పట్టుకున్నారు. అతని వద్ద ఉన్న సుమారు 400 గ్రాముల గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లు వెల్లడించారు. ఈ గంజాయి బాపట్ల జిల్లా చీరాలలో ఒక సాధువు దగ్గర రూ.4వేలకు కొనుగోలు చేశారని తెలిపారు. అందులో కొంత వాడుకున్నట్లు నిందితుడు తెలిపాడని వివరించారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు ఆయన తెలియజేశారు.